క్లుప్తంగా

టీచర్ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

కేసముద్రం: మండలంలోని కల్వల మోడల్ స్కూల్, కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ ఇంగ్లిష్ అవర్లీ బెస్ట్ టీచర్ పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి పోస్టుకు సంబంధిత సబ్జెక్ట్‌లో బీఈడీ, పీజీ, డిగ్రీ కలిగి ఉండాలని, అభ్యర్థులు వారి సర్టిఫికెట్‌లతో ఈనెల 8న మోడల్‌స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 11న డెమో, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కురవి: సీరోలు మండలం చింతపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం బి.శంకర్‌నాయక్ మంగళవారం తెలిపాడు. అండర్–14 విభాగం బాస్కెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లాలో జరుగుతాయని ఆయన వివరించారు. ఈ పోటీలకు స్కూల్‌కు చెందిన ఎం.పవన్, ఎ.వర్షిత్, వి.మహేశ్వరీ, టి.దీప్తిక, డి.మమతలు ఎంపికకాగా వీరిని మండల పరిషత్ వైస్ ఎంపీపీ దొంగలినర్సయ్య, పీఈటీ పిల్లి కమల్‌కిషోర్, ఉపాధ్యాయులు అభినందించారు.

బాలల సైన్స్ కాంగ్రెస్‌కు విద్యార్థినులు



దంతాలపల్లి: హైదరాబాద్(సీఈఎస్ఎస్)లో నిర్వహించిన రాష్ట్రస్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు మండల కేంద్రంలో గల జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నట్లు హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి సోమవారం తెలిపాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 9వ తరగతి చదువుతున్న జ్యోత్స్న, నిహారిక పాల్గొని ఆరోగ్యకరమైన ఆహారం అనే అంశంపై రాష్ట్రస్థాయిలో పాల్గొన్నట్లు తెలిపాడు. వీరితోపాటు గైడ్ ఉపాధ్యాయుడు ఆర్.వేణుగోపాల్ పాల్గొన్నాడు. విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

గెలుపోటములు సహజం



పెద్దవంగర: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నాడు. మంగళవారం ఆయన బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధైర్య పడొద్దన్నారు. మాజీ మంత్రి దయాకర్‌రావు పాలకుర్తి నియోజకవర్గం ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటారని పేర్కొన్నారు. ప్రజలు తీసుకున్న నిర్ణయాన్ని గౌరవిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ, సోమారెడ్డి, యాదగిరిరావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు అభివృద్ధికి నాంది



తొర్రూరు: పాలకుర్తిలో కాంగ్రెస్ గెలుపు అభివృద్ధికి నాంది అని ధర్మశ్రీ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు ధరావత్ విమల, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ధరావత్ సోమన్న అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యేగా యశస్వినిరెడ్డి గెలుపును హర్షిస్తూ ధర్మశ్రీ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని దుబ్బతండాలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు ధరావత్ లోకేష్, విశ్వనాథ్, శ్రీనివాస్, దేవేందర్ నాయక్, బిచ్చా నాయక్, వాసు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ మృతి బాధాకరం

బయ్యారం: జనగామ జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అకాల మరణం బాధాకరమని మహబూబాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు అన్నారు. మంగళవారం ఆమె ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేశారు. చాలా భవిష్యత్ ఉన్న నాయకుడు అకస్మాత్తుగా గుండెపోటుతో కన్నుమూయడం తనను కలిచివేసిందన్నారు. సంపత్‌రెడ్డి కుటుంబానికి ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిపారు.

అకాల వర్షాలతో రైతులు ఆగమాగం

- మిచాంగ్ తుపాన్‌తో అన్నదాతల ఉక్కిరిబిక్కిరి
- కల్లాల్లోనే తడిసిన ధాన్యం కుప్పలు



కురవి: చింతపల్లి తండా వద్ద వరి ధాన్యం కుప్ప చుట్టూ నిలిచిన వర్షపు నీరు



తొర్రూరు రూరల్: ఫత్తేపురంలోని వరి కల్లంలో తడిసిన ధాన్యం రాశులు



గూడూరు: రహదారుల పక్కన ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు



బయ్యారంలో ధాన్యం తడవకుండా రాశులపై టార్పాలిన్లు కప్పిన రైతులు



కురవి: ధాన్యం రాశి పక్కన నీటి ప్రవాహం రాకుండా అడ్డుకట్ట వేస్తున్న రైతులు



దంతాలపల్లి: బొడ్లాడ గ్రామంలో తడిసిన ధాన్యం కుప్పలు



చిన్నగూడూరులో నేలవాలిన వరి



గార్ల: మార్కెట్‌యార్డులో..

కురవి: మిచాంగ్ తుపాన్ కారణంగా సీరోలు, కురవి మండలాల్లోని వివిధ గ్రామాల్లో మంగళవారం కురిసిన వర్షానికి రైతులు సాగు చేసిన వరి పంట నీట మునిగింది. సీరోలు మండలంలోని చింతపల్లి తోపాటు శివారు గిరిజన తండాల్లో రైతుల ధాన్యం రాసులు కల్లాల్లోనే ఉన్నాయి. ఖమ్మం, మరిపెడ జాతీయ రహదారుల వెంట రైతులు పోసుకున్న ధాన్యం రాశులపై టార్పాలిన్‌లను కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు.

దంతాలపల్లి: మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సోమవారం రాత్రి నుంచి కర్తున్న వర్షాలకు రైతుల పరిస్థితి అగంగా మారింది. మండలపరిధిలో రైతులు 40 శాతం వరి కోశారు. దీంతో ఇబ్బందులు పడుతున్నారు.

తొర్రూరు రూరల్: మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అకాల వర్షాలతో కల్లాల్లో నిల్వ ఉన్న వరి ధాన్యం మంగళవారం తడిచి ముద్దయింది. ప్రధానంగా కాంటాలు పెట్టేందుకు కల్లాల్లో ఉన్న ధాన్యమంతా వర్షపు నీటిలో తడిచిపోకుండా ఉండేందుకు రైతులు ధాన్యం రాశులపై పరదాలు కప్పుకుంటూ నానా తంటాలు పడుతున్నారు.

నర్సింహులపేట/కొత్తగూడ కురుస్తున్న వర్షంతో మండలంలోని ముంగిమడుగు, వంతడపల కొనుగోలు కేంద్రాల్లో వర్షంతో తడిసిన ధాన్యంపై రైతులు మంగళవారం టార్పాలిన్లు కప్పారు. ఇలాగే వర్షం కురిస్తే పంటలకు నష్టం కలిగే అవకాశం ఉందని రైతులు తెలిపారు.

గూడూరు: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో మండలంలోని రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను కాపాడుకునేందుకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రహదారులపై ఆరబోసిన ధాన్యం కుప్పల పరిస్థితి అదేవిధంగా ఉంది. మరోవైపు కోత దశకు వచ్చిన పంటలు తడిసి నేల వాలడంతో ఆందోళన చెందుతున్నారు.

బయ్యారం: బయ్యారం, జగ్గుతండా, వెంకట్రాంపురం, బాలాజీపేట, ఉప్పలపాడు, గౌరారం, కొత్తపేట–గంధంపల్లి, సింగారం తదితర గ్రామాల్లో జల్లులతో కూడిన వర్షం పడుతుండడంతో వరి రైతులకు ఇబ్బందికరంగా మారింది. జల్లులు ఇలాగే కొనసాగితే కోతకు వచ్చిన వరిపొలాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వరి రైతులు ఆందోళన చెందుతున్నారు.

గార్ల: మిచాంగ్ తుపానుతో కురుస్తున్న వర్షాలకు గార్లలోని మార్కెట్‌యార్డులో రైతులు ఆరబోసుకున్న వరిధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గార్లలో రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు రైతులు కల్లాల్లో ఆరబోసుకున్న వరిధాన్యం తడవకుండా ధాన్యం రాశులపై టార్పాలిన్ పట్టాలు కప్పుకొని జాగ్రత్త పడ్డారు. గుడ్డిపత్తికి మార్కెట్‌లో ధర తక్కువగా వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చిన్నగూడూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే కోసిన ధాన్యం మెదళ్లు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం రాశులు తడిసి ముద్దయింది. కొన్నిచోట్ల కోతకొచ్చిన వరి ఈదురు గాలులకు పంట నేలవాలాయి. చేతికొచ్చిన పంట నేలపాలు కావడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.

సీఎంగా రేవంత్ రెడ్డి ఖరారుపై హర్షం

మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డిని ఖరారు చేయడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో హర్షాతిరేకాలు మిన్నంటాయి. ఈమేరకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 7న రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం ఉండడంతో కాంగ్రెస్ పార్టీలో నూతనోత్సాహం నిండిందని ఆయన పేర్కొన్నారు.

మానుకోటలో సంబురాలు

మహబూబాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డిని ప్రకటించిన సందర్భంగా మహబూబాబాద్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పప్పన్న ఫాలోవర్స్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అంబేడ్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణాసంచా కాల్చి ఘనంగా సంబురాలు జరిపారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

డోర్నకల్: డోర్నకల్ మండలం దుబ్బ తండాకు చెందిన ఓ వివాహిత ఈనెల 2వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి అదృశ్యమైంది. డోర్నకల్ ఎస్సై సంపత్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బతండాకు చెందిన చందావత్ శ్రీదేవి(22) ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం భర్త సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

రాకపోకలకు అంతరాయం

డోర్నకల్: మెయిన్ రోడ్డు నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో రైల్వే ఆధ్వర్యంలో చేపట్టిన డ్రెయినేజీ పనుల కోసం రోడ్డుకు అడ్డంగా కాల్వ తవ్వడంతో రాకపోకలు నిలిచాయి. దీంతో స్టేషన్ వెళ్లే ప్రయాణికులతోపాటు స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పనులు వేగవంతం చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్: మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించాడు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం అభివృద్ధి పనులపై చైర్మన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించాడు. ఆ తర్వాత మున్సిపాలిటీ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. గడువులోపు పనులు పూర్తి చేసేలా అధికారులు పనులను పర్యవేక్షించాలన్నారు. పనుల్లో నాణ్యతా లేకుంటే బిల్లులు నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసన్నరాణి, డీఈ సీహెచ్ ఉపేందర్ , ఏఈ సురేష్ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



నెహ్రూసెంటర్: దుప్పట్లు పంపిణీ చేస్తున్న కిషన్‌నాయక్

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని పత్తిపాక, మంగళికాలనీ, మందుల బజారు, వినాయకతండాలోని 60మంది పేద వృద్ధులకు గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ కిషన్ నాయక్ మంగళవారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిటైర్డ్ హెచ్‌ఎం దివంగత హత్తిరాంనాయక్ ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన నుంచి నిరుపేదల పక్షాన నిలబడి ఎంతో మందికి విద్యారంగంలో విద్యనందించేందుకు పేదలకు చేయూతనందించారని, ఆయన చేసిన సేవలను కొనసాగిస్తూ పేదలకు ప్రతిఏటా దుప్పట్లు పంపిణీ, అనాథలకు సామగ్రి పంపిణీ, అన్నదానం వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ర్యక్రమంలో కై కబాయి, లక్ష్మీ, శారద, విజయ, మోహన్, తారాచంద్, వెంకన్న పాల్గొన్నారు.

నెల్లికుదురు: మండలంలోని మేచరాజుపల్లి పెద్దతండా గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం యువభారత్ యూత్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్ల పంపిణీ చేసినట్లు యూత్ బాధ్యులు బాధావాత్ సురేష్, నవీన్ తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు విజయ్, బాలకృష్ణ, నెహ్రూ, వెంకన్న, నరేష్, తరుణ్, నవీన్ పాల్గొన్నారు.

సొంత పనులకు జీపీ ట్రాక్టర్



జీపీ ట్రాక్టర్‌లో ధాన్యం తరలింపు

చిన్నగూడూరు: పల్లెలు పరిశుభ్రంగా ఉంచుకోవాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీకి ట్రాక్టర్ మంజూరు చేస్తే దానికి విరుద్ధంగా సర్పంచ్ సొంత పనులకు పంచాయతీ ట్రాక్టర్ వినియోగిస్తున్న సంఘటన మండలం విస్సంపల్లి గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని విస్సంపల్లి గ్రామంలో సోమవారం రాత్రి సర్పంచ్ తన వ్యవసాయ పొలంలో పంట నూర్పిడి చేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లో వడ్లను గ్రామానికి తరలిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. ఇదేమిటని వారు ప్రశ్నించగా.. నిర్లక్ష్యంతో సమాధానం బదులిచ్చినట్లు తెలిపారు. దీంతో ఆగ్రహించిన స్థానికులు ఆందోళన చేస్తూ జీపీ ట్రాక్టర్‌ను గ్రామపంచాయతీకి తరలించారు. గతంలో కూడా చాలా సార్లు జీపీ ట్రాక్టర్‌ను తన సొంత పనులకు వాడుకున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ బొమ్మ లింగన్న, గ్రామస్తులు బొమ్మ శ్రీశైలం, కొమ్ము శరత్, శ్రీను, బాబు, మధు, తదితరులు ఉన్నారు.

ఎన్ఎంఎంఎస్ పుస్తకాల అందజేత



మహబూబాబాద్ అర్బన్: పుస్తకాలు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని అనంతారం మోడల్ స్కూల్ విద్యార్థులకు నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ పుస్తకాలను సామాజికవేత్త సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మంగళవారం పంపిణీ చేశాడు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అమరావతి, ఎన్ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మోహన్, కోఆర్డినేటర్ సరిత, ఉపాధ్యాయులు నాగేందర్ రావ్, రమేష్ పాల్గొన్నారు.

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌లో సెంట్రల్ స్కాలర్ షిప్ పరీక్ష రాయనున్న 8వ తరగతి విద్యార్థులకు, నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీమెటీరియల్, పెన్నులు, నోట్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మూడావత్ మోహన్, హెచ్‌ఎం రూపారాణి, పీఈటీ కొమ్ము రాజేందర్, డైరెక్టర్ జయకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త మండలం ఇచ్చినా ఫలితం దక్కలే

కురవి: ఉమ్మడి కురవి మండలంలోని సీరోలు గ్రామం కేంద్రంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త మండలాన్ని ప్రకటించింది. దీంతో సీరోలు మండలంలో బీఆర్‌ఎస్ పార్టీకి ఆధిక్యత వస్తుందని ఆశించిన బీఆర్‌ఎస్ నాయకులకు నిరాశ ఎదురైంది. కాంగ్రెస్ పార్టీకి అన్ని గ్రామాల్లో మెజార్టీ ఓట్లు వచ్చాయి. సీరోలు, కొత్తూరు(సీ), చింతపల్లి, తాళ్లసంకీస, ఉప్పరిగూడెం, కాంపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి 8,070 ఓట్లు వచ్చాయి. డోర్నకల్ మండలంలోని మన్నెగూడెం, అందనాలపాడు, చిలుకోయలపాడు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి 2,956 ఓట్లు వచ్చాయి. మొత్తంగా 11,026 ఓట్లు వచ్చాయి. అదే బీఆర్ఎస్‌కు పాత ఉమ్మడి కురవి నుంచి విడిపోయిన సీరోలు, కాంపల్లి, చింతపల్లి, కొత్తూరు(సీ), తాళ్లసంకీస, ఉప్పరిగూడెం గ్రామాల్లో 3,188 ఓట్లు వచ్చాయి. డోర్నకల్ మండలంలోని మన్నెగూడెం, అందనాలపాడు, చిలుకోయలపాడు గ్రామాల్లో బీఆర్‌ఎస్‌కు 1,534 ఓట్లు వచ్చాయి. మొత్తంగా బీఆర్‌ఎస్‌కు 4,722 ఓట్లు వచ్చాయి మొత్తంగా సీరోలు మండలంలో బీఆర్‌ఎస్ కంటే కాంగ్రెస్ పార్టీకి ఆయా గ్రామాల్లో 6,304 ఓట్లు అధికంగా వచ్చాయి. సీరోలును నూతన మండలం చేసినప్పటికీ బీఆర్‌ఎస్‌కు కలిసిరాకపోగా కాంగ్రెస్ పార్టీకి కలిసివచ్చింది.

శిథిలావస్థలో బాలికల వసతి గృహం

- 20 ఏళ్ల క్రితం రూ.21లక్షలతో నిర్మాణం
- జీవాలకు నిలయంగా భవనం



శిథిలావస్థలో ఉన్న బీసీ బాలికల వసతిగృహం

గార్ల: గార్లలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో 20 ఏళ్ల క్రితం రూ.21లక్షలు వెచ్చించి బీసీ బాలికల వసతిగృహం భవనం నిర్మించారు. వసతిగృహం ఊరి చివర ఉందని, రాత్రి సమయంలో భయమేస్తుందని నాడు బాలికలు ఈ వసతిగృహంలో ఉండలేమని అధికారులకు మొరపెట్టుకున్నారు. బాలికల సమస్యను దృష్టిలో పెట్టుకొని గార్లలో నైజాం కాలంలో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయం ఖాళీగా ఉండడంతో బీసీ బాలికల వసతి గృహాన్ని ఇందులోకి మార్చారు. నాటి నుంచి ఊరి చివర ఉన్న కొత్త వసతిగృహం నిరుపయోగంగా ఉండడంతో, గ్రామస్తులు పశువులు, గేదెలను మేతకు వదులుతున్నారు. నాటి నుంచి వసతిగృహాన్ని పట్టించుకునే వారు లేకపోవడంతో కొందరు తలుపులు, కిటికీలు పీక్కెళ్లారు. ప్రస్తుతం వసతిగృహం భవనం గేదెలు, పశువుల దొడ్డిగా మారింది. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి బీసీ బాలికల వసతిగృహం భవనానికి మరమ్మతులు చేపట్టి వినియోగించుకోవాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

గార్ల: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి చదువులతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని నిర్మలా హైస్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ జైస్ అన్నారు. మంగళవారం గార్లలోని నిర్మలా హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన క్లాసికల్ డ్యాన్సులు విచిత్ర వేశాధరణలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిస్టర్ శలెట్‌సిని, సిస్టర్ జర్లిన్ రోస్మిన్, ప్రవీణ్, రవి, బాలస్వామి, శేఖర్, సురేందర్, పవన్, శివకృష్ణ, నాగమాల, శిరోమణి, వాణి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అంబేడ్కర్ వర్ధంతిని విజయవంతం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి సభను విజయవంతం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తప్పెట్ల వీరన్న అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రాజకీయ నాయకులు, ప్రజా, కుల, ఉద్యోగ, సామాజిక ఉద్యమ నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, వ్యాపారవేత్తలు విద్యార్థి సంఘాలు కోర్టు ముందున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉదయం 9గంటలకు నిర్వహించే సభలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సంజీవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నీరుడు సామెల్, జిల్లా కోశాధికారి ఐతం వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు వెంకన్న, రంగన్న, కాటయ్య, తదితరులు పాల్గొన్నారు.

కూలిన శిలాఫలకం

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని జెడ్పీహెచ్‌ఎస్ సమీపంలో రోడ్డు ప్రక్కన శిలాఫలకం మంగళవారం కూలింది. సోమవారం నుంచి వర్షం పడుతుండటం, అడుగుభాగం తడవడంతో శిలాఫలకం కూలింది. మున్సిపాలిటీ సిబ్బంది కూలిన శిలాఫలకాన్ని తొలగించారు. కొద్ది రోజుల క్రితం రెడ్యానాయక్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 15వ వార్డు అభివృద్ధి పనుల కోసం శంకుస్థాపన చేసి ఈ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

కాంగ్రెస్‌తోనే ఇందిరమ్మ రాజ్యం

నర్సింహులపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతోనే ఇందిరమ్మ రాజ్యం సాధ్యమని మైనార్టీ సెల్ మండల కమిటీ అధ్యక్షుడు ఎస్‌కె.రఫీ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పాషా, రహీం, వెంకన్న, కిషన్, సీతరాం, వసునాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఫ్యాన్లు అందజేత



నెల్లికుదురు: మండలంలోని రామన్నగూడెం గ్రామ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు తొర్రూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సీలింగ్ ఫ్యాన్లు, పిల్లల బరువు తూకం వేసే యంత్రంతోపాటు పాఠశాలకు రంగుల కోసం రూ.22వేలు మంగళవారం హెచ్‌ఎం మచ్చ సోమయ్యకు అందించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు ఒరిజన పల్లి దీప, ఆర్యవైశ్య సంఘం సభ్యులు రాంమూర్తి మాట్లాడుతూ.. మచ్చ ఉమాదేవి, సోమయ్య గార్ల జన్మదిన వేడుకలను పురస్కరించుకుని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటరమణ, అనిల్, ఆదిత్య, రవి, మణికంఠ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

తొర్రూరు: ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని బాలాజీ సోషల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకుడు నర్కుటి సంతోష్ అన్నారు. స్థానికుడు సిరిగిరి రవి అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం సొసైటీ ప్రతినిధులు బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందించారు.

ఆరు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం

దంతాలపల్లి: మండలం దాట్ల, రేపోని, లక్ష్మీపురం, వేములపల్లి, దొనకొండ, కుమ్మరికుంట్ల గ్రామాలలో సోమవారం కురిసిన వర్షానికి విద్యుత్ అంతరాయం కలిగింది. పెద్దనాగారం సబ్‌స్టేషన్ నుంచి రేపోని,వే ములపల్లి సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరాఫరా చేసే లైన్ రాత్రి సమారు 11గంటల ప్రాంతంలో తెగి పడింది. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు దంతాలపల్లి సబ్‌స్టేషన్ నుంచి రెండు గ్రామాల సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరాఫరాను పునరుద్ధరించారు.

అన్నదానం

కేసముద్రం: మండల కేంద్రంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు దామరకొండ ప్రవీణ్‌కుమార్, పుష్ప దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప మాలదారులకు మహాఅన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో అన్నదాన సేవాసమితి ప్రధాన కార్యదర్శి పోలెపల్లి యాకుబ్‌రెడ్డి, బండి సంపత్‌కుమార్, గోపా డివిజన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్, ఎల్లాగౌడ్, లక్కాకుల సత్యనారాయణ, ఎర్రంశెట్టి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి



పెద్దవంగర: ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలని మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ తొర్రూరు మండల కమిటీ అధ్యక్షుడు కాసోజు సాయినాథ్ అన్నారు. నేషనల్ వలంటీర్ డే సందర్భంగా మంగళవారం మండలంలోని చిన్నవంగర గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు గాడిపెల్లి కృష్ణప్రసాద్ సాకారంతో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా సాయినాథ్ మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదువుకోవాలని, పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ ద్వారా తోడ్పాటు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సురేష్ బాబు, రాజేష్, చందురెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.